క్లుప్తంగా

చీరల పంపిణీ



జఫర్‌గఢ్‌: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని షాలోమో మినిస్ట్రీస్ చర్చిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య క్రైస్తవ మహిళలకు బుధవారం చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర కేకును కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం క్రిస్టఫర్ అధ్యక్షత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. క్రైస్తవులు పాల్గొన్నారు.

మంద కృష్ణను కలిసిన ఈవీకే



దేవరుప్పుల: నూతన సంవత్సరం పురస్కరించుకుని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగను మండలంలోని చిన్న మడూరుకు చెందిన మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, న్యాయవాది ఈరెంటి విజయ్‌కుమార్(ఈవీకే) బుధవారం హైదరాబాద్‌లో కలిసి కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజకీయాలకతీతంగా ఏబీసీడీ వర్గీకరణ కోసం పాటుపడాలని సూచించినట్లు తెలిపారు.

అయ్యప్ప పడిపూజ

జనగామ రూరల్: మండలంలోని చీటకోడూర్‌లో పర్శరాములు ఇంటి వద్ద గురుస్వామి పుచ్చా నరసింహమూర్తి ఆధ్వర్యంలో బుధవారం మాలధారులు భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు చేపట్టారు. మాలధారులు, భక్తులు పాల్గొన్నారు.

గర్భిణి మృతి


సాత్విక (ఫైల్)

బచ్చన్నపేట : గర్భిణికి ప్రసవ సమయంలో ఫిట్స్ రావడంతో చికిత్సకు తరలిస్తుండగా బుధవారం మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని కేసిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బొడ్డు రమేశ్ భార్య సాత్విక(23)ను ప్రసూతి కోసం మంగళవారం జనగామలోని చంపక్ హిల్స్ ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. కాగా, సాత్వికకు డెలివరీ సమయంలో ఫిట్స్ వచ్చాయని వైద్యులు వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లాలని సూచించారు. కుటుంబ సభ్యులు ఆమెను అక్కడికి తీసుకెళ్లే సరికే మృతి చెందిందని వైద్యులు తెలిపారు. దీంతో గ్రామంలో విషాదం అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు


క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలిస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి, గ్రామస్తులు

పాలకుర్తి టౌన్: మద్యం సేవించి ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన బుధవారం మండలంలోని గూడూరులో చోటుచేసుకుంది. గూడూరు గ్రామానికి చెందిన బెల్లి రవి రాఘవపురం –గూడూరు గ్రామాల మధ్య ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన పడిపోవడంతో రవికి తీవ్రగాయాలయ్యాయి. పాలకుర్తి సీఐ గట్ల మహేందర్‌రెడ్డి, గ్రామస్తులు క్షతగాత్రుడిని పాలకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యచికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు వరంగల్‌కు తరలించారు.


స్వయం ఉపాధి వైపు మొగ్గు చూపాలి

చిల్పూరు: ప్రభుత్వ ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా యువత స్వయం ఉపాధివైపు మొగ్గు చూపాలని ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బండారి రాజేష్‌కు ప్రధాన మంత్రి ఫార్మలేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్ మంజూరైంది. కాగా, రాజేష్ చిల్పూరుగుట్ట సమీపంలో మహేశ్వర ఎంటర్‌ప్రైజెస్ పేరుతో ఏర్పాటు చేసిన హాయ్ బిస్కెట్ తయారీ కేంద్రాన్ని ఎస్సై బుధవారం ప్రారంభించి పలు సూచనలు చేశారు. రంజిత్‌రెడ్డి, దివాకర్ రెడ్డి, తోకల లక్ష్మారెడ్డి, బండారి రాజ్‌కుమార్, లలిత, బండారి శాయి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెన మలుపు

- పట్టించుకోని అధికార యంత్రాంగం
- నిర్మాణంలో కనీస సూత్రాల విస్మరణ
- మలుపుల వద్ద రెయిలింగ్ కరువు
- త్రుటిలో తప్పుతున్న ప్రాణాపాయం


దేవరుప్పుల వాగుపై ప్రమాదకరంగా ఉన్న వంతెన మలుపు


రెయిలింగ్ లేని వంతెన

దేవరుప్పుల: మండల కేంద్రంలోని వాగుపై ఉన్న వంతెన మూలమలుపు ప్రమాదకరంగా మారి తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా పంచాయతీరాజ్, రోడ్ల విభాగం అధికార యంత్రాంగం కనీస ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రావిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేవరుప్పుల గ్రామాన్ని ఆనుకుని ఉన్న వాగుపై గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో భారీ వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ ఉధృతితో నాటి ప్రభుత్వం లాంఛనంగా వంతెనను ప్రారంభించలేకపోయింది. దీంతో అప్పటి అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ ఈ వంతెన మూలమలుపు వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు కనీస సూత్రాలు పాటించకుండా కేవలం దిమ్మెలు కట్టి చేతులు దులుపుకున్నారు. కొద్దిశాతం మాత్రమే రెయిలింగ్ నిర్మాణ పనులు చేపట్టి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టలేదు. దేవరుప్పుల నుంచి పాలకుర్తి రూట్‌లో వాహనాల రద్దీ పెరగడంతో మలుపు వద్ద ఎదురెదురుగా వాహనాలు తారసపడినా, వాహనదారుల వేగం పెరిగినా గాలిలో ప్రాణాలు కలిసే ప్రమాదం నెలకొంది. దీనికితోడు ఇదే మలుపు గుండా మిషన్ భగీరథ ఇనుప పైపులైన్ వెళ్లడంతో పైపునకు మోటారు సైకిల్ తాకితే ఎగిరి పడిపోతున్నారు. ఇప్పటి వరకూ ఐదు ప్రమాదాలు చోటుచేసుకోవడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది. దీనికి కారణం వంతెన మలుపు రేయిలింగ్ లేని కింది ప్రాంతం రైతులు వృథాగా విడిచే నీటి బురద వల్ల కాళ్లు, చేతులు, నడుము విరుగుడుకే పరిమితమవుతున్నాయని, లేదంటే యువకుల ప్రాణాలు గాలిలో కలువడం ఖాయమని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా నిత్య ప్రమాదపుటంచున ఉన్న వంతెన మలుపు వద్ద సత్వరమే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి వాహనదారుల ప్రాణసంకట సమస్యకు పరిష్కారం చూపాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నాం



రోజూ దేవరుప్పుల, ధర్మాపురానికి ఆటోలో ప్రయాణికులను తీసుకెళ్లే క్రమంలో బ్రిడ్జి మలుపు వద్ద దిమ్మలకు అడ్డంగా లేకపోవడంతో డేంజర్‌గా తయారైంది. ఎదుటిగా వాహనం వస్తే పక్కకు జరిగితే ఆటో సైతం కింద పడిపోతోంది. దీంతో అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని డ్రైవింగ్ చేయాల్సి వస్తోంది.

\- చింత భిక్షపతి, ఆటోడ్రైవర్, దేవరుప్పుల

దిమ్మెలకు అడ్డంగా పట్టీలు ఏర్పాటు చేయాలి



బ్రిడ్జి నుంచి పాలకుర్తి ధర్మాపురం మీదుగా రద్దీ పెరిగింది. మలుపు వద్ద దిమ్మలకు అడ్డంగా ఏమీ లేకపోవడంతో ఎదురుగా ఏది వచ్చినా తప్పించబోయి గిరిజన పిల్లలు రెండు మూడుసార్లు కింద పడిపోయారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని ప్రమాదాలు జరుగకుండా దిమ్మెలకు అడ్డంగా పట్టీలు ఏర్పాటు చేయాలి.

\- లావుడ్య నర్సింహ, లకావత్‌తండా

ఎస్సారెస్పీ నీరు విడుదల


జలపూజ చేస్తున్న ఎమ్మెల్యే సామేలు

కొడకండ్ల: యాసంగి సీజన్ సాగు కోసం సూర్యాపేట జిల్లాకు ఎస్సారెస్పీ నీరును బుధవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు విడుదల చేశారు. కొడకండ్ల మండలకేంద్రంలోని బయ్యన్న వాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి మెయిన్‌గేట్లను ఎత్తి సూర్యాపేట జిల్లాకు ఎస్సారెస్పీ కెనాల్ ద్వారా సాగునీటిని ఎమ్మెల్యే విడుదల చేసి జలపూజ నిర్వహించారు. యాసంగి సాగు కోసం తొలుత 500 క్యూసెక్కుల నీటిని వారం రోజుల పాటు విడుదల చేయనున్నామని, గోదావరి జలాలను వృథా చేయకుండా రైతులు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సారెస్పీ డీఈలు సత్యనారాయణ, హరికృష్ణ, ఏఈలు అమర్, చంద్రశేఖర్, విక్రం, హరీష్, మహేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సప్తవర్ణ శోభితం జనగామ చౌరస్తా


రంగురంగుల విద్యుత్ వెలుగుల్లో ఫౌంటెయిన్



నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని జనగామ చౌరస్తాలోని ఫౌంటెయిన్ రంగు రంగుల విద్యుత్ దీపాల వెలుగులో సప్త వర్ణిత శోభితంగా ప్రజలను మంత్ర ముగ్ధులను చేసింది. ఫౌంటెయిన్ చుట్టూ గజరాజులు కొంగొత్త రంగులతో నూతన శోభను సంతరించుకోగా, మధ్యలో రాణీరుద్రమదేవి విగ్రహం వీరత్వాన్ని చాటిచెప్పే విధంగా ఆకర్షణగా నిలిచింది. -జనగామ

రేవంత్‌రెడ్డి ఏడాది పాలన అట్టర్‌ఫ్లాప్


మాట్లాడుతున్న రాజయ్య

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏడాది పాలన సాగించిన రేవంత్‌రెడ్డి అత్యంత అట్టర్‌ఫ్లాప్ సీఎంగా నిలిచారనని, అన్ని వర్గాల ప్రజలు సీఎం పాలనను వ్యతిరేకిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజయ్య మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి రాక్షస పాలన సాగిస్తున్నారని, ప్రజా సమస్యల్ని పట్టించుకోకుండా డైవర్షన్ రాజకీయాలు చేస్తూ ప్రజలను మభ్య పెడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏడాది కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని, ఉచిత హామీలను చేసి ప్రజలను దగా చేశారన్నారు. రాష్ట్రంలో సాగుతున్న నియంతపాలనను ప్రజలను గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఘన్‌పూర్ నియోజకవర్గంలో అభివృద్ధి విషయమై స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఉత్తర ప్రగల్భాలు పలుకుతున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం వ్యక్తిగత రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం అధికార కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారని, రూ.1,000 కోట్ల అభివృద్ధి పనులు తెచ్చానని ఊదరగొట్టు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌నాయకులు కనకం గణేష్, తాటికొండ సురేష్‌కుమార్, గుర్రం శంకర్, మాతంగి దేవయ్య, చింత శ్రీను, చిట్టిబాబు, యేసుబాబు, ఆకారపు అశోక్, గుండె మల్లేష్, ఆకుల నర్సింహరాములు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పాల్స్‌లో న్యూ ఇయర్ సంబురాలు


కేక్ కట్ చేస్తున్న మరియా జోసెఫ్

జనగామ: పట్టణంలోని నెహ్రూపార్కు ఏరియా సెయింట్ పాల్స్ స్కూల్‌లో రెండు రోజులుగా న్యూ ఇయర్ సంబురాలు జరుపుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ మరియా జోసెఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి కేక్‌కట్ చేసి కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. పాఠశాలను విద్యుత్ దీపాలతో అలంకరించి పెద్ద ఎత్తున న్యూ ఇయర్ వేడుకలను నిర్వహించారు.

టీజీబీ సేవలు ప్రారంభం



పాలకుర్తిలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు

పాలకుర్తి టౌన్: తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పేరుతో బుధవారం బ్యాంకు కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని పాలకుర్తి బ్రాంచ్ మెనేజర్ ఎ.సమీర్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు(ఏపీజీవీ)ను తెలంగాణ గ్రామీణ బ్యాంకు(టీజీబీ)లో విలీనం చేయడంతో రూ. 70వేల కోట్లతో 927 బ్రాంచ్‌లు కలిగి రాష్ట్రంలో అతిపెద్ద బ్యాంకుగా కొనసాగనుందన్నారు. ఏపీజీవీబీ విలీనంతో ఖాతా నంబర్లు మారవని, ఇక నుంచి ఏపీజీవీబీ ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0 ఆర్‌ఆర్‌డీసీబీగా మారినట్లు తెలిపారు. టీజీబీ మొబైల్ బ్యాంక్ అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేసుకుని సేవలను ఉపయోగించుకోవాలన్నారు. ఖాతా నంబర్‌తో టీజీబీ యూపీఐ రిజిస్టర్ చేసుకోవాలన్నారు. బ్యాలెన్స్ విచారణ, నాన్ ఫైనాన్షియల్ లావాదేవీల కోసం టీజీబీ మిస్డ్ కాల్/వాట్సాప్ బ్యాంకింగ్ కోసం 9278031313 నంబర్‌ను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంపీని, ఎమ్మెల్యేను కలిసిన నాయకులు


ఎంపీ, ఎమ్మెల్యేకు మొక్కను ఇస్తున్న నాయకులు

జఫర్‌గఢ్/రఘునాథపల్లి/స్టేషన్‌ఘన్‌పూర్/చిల్పూరు: ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరిని బుధవారం హనుమకొండలో జిల్లా, మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం, మొక్క అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ మారుజోడు రాంబాబు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకుడు, అభ్యుదయ యువజన సంఘం నియోజకవర్గ కన్వీనర్ పోశాల కృష్ణమూర్తి, చిల్పూరు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, సింగిల్ విండో చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, కోళ్ల రవిగౌడ్, కావటి భాస్కర్ యాదవ్, తాటికొండ వెంకటేష్‌యాదవ్, లోనె శ్రవణ్, సీహెచ్.నరేందర్‌రెడ్డి, బెలిదె వెంకన్న, బూర్ల శంకర్, సింగపురం వెంకటయ్య, పల్లె రవీందర్, పెద్దిరెడ్డి, గుజ్జరి రాజు, రడపాక సుదర్శన్ తదితరులు ఉన్నారు. అలాగే చిల్పూరు ఆలయ అర్చకుడు రంగాచారులు వేదమంత్రాల నడుమ ఎంపీ, ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేసి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని ఇచ్చారు.

ఘనంగా శౌర్య దివస్


నివాళులర్పిస్తున్న నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్: బహుజన ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలోకి అంబేడ్కర్ సెంటర్ వద్ద భీమా కోరెగావ్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం నాయకులు మాట్లాడుతూ 28 వేల మంది పీష్వాలను కేవలం 500 మంది దళిత బహుజన యోధులు చిత్తుగా ఓడించిన విజయోత్సవానికి గుర్తుగా శౌర్య దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అక్కినపెల్లి వెంకటేశ్వర్లు, జలగం ప్రవీణ్, గాదె పృథ్వీ, నలిమెల నాగరాజు, చాడ ఏలియా, గుర్రం నవీన్, జీడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ: పాత బీటుబజార్‌లోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో..



పాలకుర్తి టౌన్: మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు కేక్ తినిపిస్తున్న నాయకులు



హుషారుగా నూతన సంవత్సర వేడుకలు


జఫర్‌గఢ్: చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న గాదె ఇన్నయ్య

సాక్షి నెట్‌వర్క్: కొత్త సంవత్సర సంబురాలను ప్రజలు జిల్లా వ్యాప్తంగా హుషారుగా జరుపుకున్నారు. మంగళవారం అర్ధరాత్రి 12 గంటలు దాటే వరకు నిరీక్షించిన తర్వాత ఒక్కసారిగా యువత బాణసంచా పేల్చి, కేరింతలతో హంగామా చేశారు. కుటుంబ సభ్యులు 2025 నూతన సంవత్సర కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. చిన్నారులు సహితం కేక్ కట్ చేసి అవదులు లేని ఆనందంలో తేలియాడారు. బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి ఒకరి కొకరు ఆప్యాయంగా పలకరించుకుంటా న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బుధవారం తెల్లవారు జామునుంచి మహిళలు ఇళ్ల ముంగిట న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపే రంగవల్లులు వేశారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని బచ్చన్నపేట సిద్ధేశ్వరాలయం, చిల్పూరు, జనగామ బాణాపురం వేంకటేశ్వరాలయం, ఉప్పల సహిత శ్రీ ఆంజనేయస్వామి, యశ్వంతాపూర్ రేణుకా ఎల్లమ్మతల్లి, బతుకమ్మకుంట విజయదుర్గా మాత, పాలకుర్తి సోమేశ్వరాలయాలు, లింగాల ఘనపురం జీడికల్ సీతారామచంద్రస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి. స్వామి వారి దర్శనం కోసం గంటకు పైగానే సమయం పట్టింది. డీసీపీ రాజమహేంద్ర నాయక్ పర్యవేక్షణలో ఏసీపీ, సీఐ, ఎస్సైలు, పోలీసుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బందోబస్తు చేపట్టారు. అన్ని ప్రధాన వీధుల్లో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, తెల్లవారు జాము వరకు గస్తీ తిరగడంతో యువత బయటకు రాలేదు. యశ్వంతాపూర్ ఎల్లమ్మ ఆలయంలో మాతను దర్శించుకునేందుకు వంద లాదిగా భక్తులు తరలి వచ్చారు. దేవరుప్పుల మండల కేంద్రంలోని బాలయేసు హైస్కూల్‌లో బ్రదర్ జేసురాజు, పలు చర్చిల్లో క్రైస్తవులు ప్రార్థనలు చేసి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు.


బచ్చన్నపేట చర్చిలో సందేశం ఇస్తున్న పాస్టర్


దేవరుప్పుల: కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు


బచ్చన్నపేట: సిద్ధేశ్వరాలయంలో పూజ చేస్తున్న భక్తులు


రఘునాథపల్లి: నిడిగొండలో..


స్టేషన్‌ఘన్‌పూర్: ఆర్‌సీఎం చర్చిలో ప్రార్థన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య


చిల్పూరు: సిమోను ప్రార్థనా మందిరంలో..

శబరిమలకు తరలిన మాలధారులు


ఇరుముడులతో మాలధారులు

కొడకండ్ల: మాల విరమణ కోసం మండలకేంద్రానికి చెందిన అయ్యప్ప మాలధారులు బుధవారం శబరిమలకు తరలివెళ్లారు. మాలధారణ చేసిన స్వాములు 41 రోజుల పాటు నియమనిష్టలతో దీక్షను చేపట్టారు. స్థానిక భక్తాంజనేయ స్వామి ఆలయంలో శివ గురుస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఇరుముడుల కట్టుకుని మాల విరమణ కోసం శబరిమలకు బయలుదేరారు. వారం రోజుల పాటు వివిధ పుణ్య క్షేత్రాలను దర్శించుకుని శబరిమలలో మాల విరమణ చేయనున్నట్లు స్వాములు తెలిపారు. తరలివెళ్లిన వారిలో గురు స్వాములు శ్రీపాద ఆంజనేయచారి, మామిడి మల్లయ్య, మెరుగు సోమేశ్వర్ తదితరులు ఉన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

- సీఐ మహేందర్‌రెడ్డి


గూడెల్లి గూడెంలో సైకిల్‌పై వెళ్తున్న సీఐ

పాలకుర్తి: గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సీఐ మహేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం సీఐ సైకిల్‌పై గూడెల్లిగూడెం, పాలకుర్తిలో పర్యటించి ప్రజలకు సీసీ కెమెరాల ప్రాధాన్యతపై వివరించారు. గ్రామస్తులు విరాళాలు వేసుకుని సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైకిల్‌పై వెళ్తూ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు.